


# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

ఆగస్ట్ 2012

సంపుటి : 18 **211** సంచిక : 8




## ఆంధ్రుల అపూర్వమైన ఆత్మగౌరవం దృశ్యం కావడం లేదు!

### - ఆవకాయను ఆవు నెయ్యితో తింటూ ధీటుగా తెలుగు పలికే నోళ్ళూ లేవు!! -

పెసరట్టూ ఉప్మా కలిపి నోరున పెట్టరా! పెనమ్మీద కాగే నూనెలా ధీరత్వం చూపరా! గుమ్మపాలను తాగినోడివి చిట్టెలుకకు జంకకురా! సింహంలా ఉన్న నీవు గరికిపోచలెదురు చూడకు! ఆంధ్రుడనే ప్రతివాడూ ఆంధ్ర కేసరి కావాలి! అల్లూరి సీతారామరాజులా అన్యాయము నెదురించాలి! నీవే నీతిమాలి గరికల కలవడినాడు – నీకెవ్వరూ దిక్కురారు! తిరిగి బానిసవే అయ్యెదవు! ఆత్మగౌరవమును తాకట్టు పెట్టకుము. ఆంధ్రవీరుడవు నీవు, దాస్యము కెరగాకు! ఆంధ్రులంతా ఒక్కటై, ఆంధ్ర పౌరుషము చిక్కబరచాలి! ఆంధ్రుడే అన్నిటా ఘనుడనిపించుకోవాలి!!

స్వాతంత్ర్య దినం వచ్చిందని ఎగరబోకోయ్. నోటి ఎదుటున్న అన్నాన్ని తినిపోకోయ్.

పది తలలున్న రావణాసురుడు దిగ్దేవతల నందర్నీ బానిసలుగా చేసు కున్నాడు. ధర్మపురుషుడైన శ్రీరామచంద్రుని భార్యను అపహరించాడు. మునులను హింసింపచేశాడు. తెలియకనే ఇవన్నీ చేసాడా? అహం, మదంతో కూడిన అధికార గర్వంతో చేసాడు. భగవద్భక్తుడే!! మహా పరాక్రమవంతుడే! ఎంతెంతటి పరాక్రమవంతుడైననూ శీలం లేనివాడు శిథిలమైపోతాడు.

అందుకే మనువు ముందుగానే మనుషులను స్మృతి (మంచి బుద్ధి)లో ఉంచాలనీ, మానవులనుద్దేశించి, వాళ్లను (ముందుగా ఇప్పుడున్న తెలుగు వాళ్ళను) ధర్మమార్గంలో నడుచుకోవాలని, రెండు చేతులకిచ్చిన పదివేళ్ళకూ పది ధర్మాల్ను చెప్పాడు. పునశ్చరణం చేసుకుంటూ, దేశం పట్ల ధర్మంగా, నీతిగా, శీలసిరిమంతునిగా బ్రతకండన్నాడు.

**ధృతిః క్షమాదమో ఽ స్తేయం శౌచమిన్ద్రియ నిగ్రహః**
**ధీర్విద్యా సత్యమక్రోధో దశకం ధర్మలక్షణమ్ ।**

– ధర్మ దశ లక్షణాలన్నిటినీ ఒకే ఒక శ్లోకంలో ఎంతో వివరించాడు:

**తనకున్నదానితో తృప్తిపడే లక్షణం ధృతి**

అపకారం చేసినవాడికి తిరిగి అపకారం చేయకుండా ఉండడం క్షమం.

అంతఃకరణ (మనసు)ను అదుపులో ఉంచుకో **దమం!**

పరుల సొత్తునపహరించకపోవడం **అస్తేయం!**

మనోవాక్కాయములు స్వచ్ఛంగా ఉంచుకోవడం **శౌచం!**

ఇంద్రియాలను యిచ్చ వచ్చినట్టు, అన్య విషయాల వైపు పోకుండా నిలుపుకోవడం **ఇంద్రియ నిగ్రహం.**

**శాస్త్ర విజ్ఞానం సముపార్జించడం.**

**ఆధ్యాత్మిక దృష్టి అలవరచుకొనడం 'విద్య'**

**సత్యం మాట్లాడడం, సత్యపాలనం 'సత్యం'**

**క్రోధాన్ని (కోపాన్ని) అణచుకోవడం 'అక్రోధం'**

– ఈ దశ లక్షణాలను పాటిస్తూ, దిశా నిర్దేశం చేసుకోవడం వల్లనే, భారతదేశం, దాన, ధాన్య, ధర్మాల కధిష్టానమైన ఆంధ్రదేశం అన్నపూర్ణగా చెలువొందింది. నీరు లేక, నారు పోయలేక రైతు కూలీలు, ఒళ్ళు వంచి పని చేయకపోవడం, వర్గ కలహాలతో కార్మికుల సమ్మెలు, నాయకులు, అధికారుల, లంచగొండితనం, మొండితనం, బండతనంతోనూ, కుటుంబం నుంచే వేర్పాటు వాదనలతో రాష్ట్రమును భ్రష్టు పట్టించారు. రాజకీయాలు పుట్టి రాజకీయ పార్టీలు పుట్టలు పుట్టలుగా పెరగడంతో, దేశ, రాష్ట్ర వెలుగుదలలు మసకబారి పోయాయి. మంత్రంగాని అక్షరం, ఔషధంగా, జీవనావసరంగా పనికిరాని మొక్క, పనిచేయలేని మనిషీ ఉండడం అరిష్టమంటారు. సాటి మానవునిపై గౌర వాన్ని, దేశ సమైక్య భావనను దృష్టిలో పెట్టని మనుష్యులుంటే సృష్టే దెబ్బతింటుం దని, ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్ర ప్రజలు గ్రహించాలి. వారి కారణంగానే భ్రూణ హత్యలు, స్త్రీ భయ రహితంగా తిరగక పోవడం, పెద్దల పట్ల తిరస్కార భావం పెరిగింది. శ్రీరాముని వంటి నాయకుడు అవతరిస్తేగానీ, రాష్ట్రానికీ అవస్థ తప్పదు. ఆంధ్రదేశానికి పట్టిన పీడ వదలదు. ఆత్మ గౌరవం కలుగదు.



బుధజన విధేయుడు

*గోటేటి శ్రీరామారావు*

**ముఖచిత్రం**

**కోరిన వరములు నొసగే కల్పతరువు**
**మహాలక్ష్మి**


Editor : **GOTETI SRI RAMA RAO**, Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# 'ఆషాఢ శ్రావణములు' అమ్మ జగదమ్మల పూజలూ, కొలువుతో తెలుగు ధరిత్రి తరించి పోతుంది!

అమ్మ జగదమ్మ మమ్ము కరుణించవమ్మ అంటూ తెలుగు ధరిత్రిలోని ముగ్గురమ్మల మూలపుటమ్మ నీవేనమ్మ ఎల్లరి అమ్మలకు అమ్మవు- మా అందరికీ మేలి బంగారు అమ్మవు.

రక్షాశక్తి మంత్రశక్తి, ప్రాణశక్తి, కళాశక్తి, విద్యశక్తి, విజ్ఞానశక్తి, వివేచనాశక్తి, వాగ్విభవశక్తి, ధార్మికశక్తి, విజయశక్తి, ఆనందశక్తి, అష్టైశ్వర్య మహాశక్తులను ప్రసాదించే మాతవు మహాశక్తివమ్మ.

**శ్రీ మహాశక్తి స్వరూపిణివి, భారతభారతివి**
**వేదమాతవు ఆది పరాశక్తివి పర్వత రాజకుమారి**
**పార్వతివి, దుర్గవు, కనకదుర్గవు, కామాక్షివి**
**మీనాక్షివి, విశాలాక్షివి, అన్నపూర్ణవు-నిను కొలువగ.**
**శ్రీ 'స' 'తి' యే నమః నమస్తుభ్యమ్-**
**శ్రీమహాలక్ష్మీయే**
**బ్రాహ్మీం, వైష్ణవీ భద్రాం షడ్భుజాంచ చతుర్భుజాం**
**త్రినేత్రాంచ త్రిశూలం చ పద్మ చక్ర గదాధరా**
**ప్రదమేత్ర్యంబకాగౌరీ!ద్వితియే వైష్ణవీ తదా**
**తృతియే కమలాప్రోక్తా చతుర్దే లోకసుందరీ!**
**పంచమే విష్ణుపత్నీచ, షష్టేచ, వైష్ణవీ తథా**
**సప్తమే చ వరారోహా అష్టమే వరదాదాయినీ**
**నమోస్తుతే ఏకదేవీ శ్రీదేవీ 'శ్రీ' 'స' 'తీ' నమోస్తుతే!**

'ముగురమ్మ'ల అంశావతారాలెన్నో!

ఊరూరా ఓ అమ్మగా వెలసి, పడతులపసుపు కుంకుమలను నిలుపుతూ, అష్ట సౌభాగ్యముల్ను ప్రసాదిస్తున్నది వీరే! బోణాలతో తెలంగాణా వారూ **'శ్రీ.స.తి.యే నమః'** అంటూ త్రికాలజ్ఞులూ పూజలు చేస్తారు. దివ్యక్షేత్ర సందర్శనం చేస్తారు. దివ్యనామ సంకీర్తనం చేస్తారు. తల్లులకు తల్లి, దేవతే అంటే అందరికీ తల్లే! తల్లి అంటే తరింప చేసింది. అల్లకల్లోలంగా ఉన్న ఆంధ్రదేశాన్ని 'శ్రీ.స.తి' తల్లి తరింపచేయాలి.


బోణాలు తీసుకువెడ్తున్న బాలిక



## -మరో ముఖ్య విశేషం!-

కొత్తగా 13వ రాష్ట్రపతి పదవిని స్వీకరించిన ప్రణబ్‌ముఖర్జీ రాజకీయాల్లో ప్రవేశించినప్పట్నుంచీ కాంగ్రెసులోనే నెహ్రూ కుటుంబానికి విశ్వసనీయుడై ఉన్నారు. తొలి ఓటు వేసిన బాపిరాజు కూడా రాజకీయాల్లో ప్రవేశించినప్పట్నుంచీ కాంగ్రెసు కార్యకర్తే! మరియూ చెప్పుకోవలసిన మరో విశేషం. బెంగాలీలకూ తెలుగు వారికీ స్వాతంత్రోద్యమ కాలం నుంచీ రాజకీయంగా, సాహిత్యపరంగా సన్నిహిత సంబంధాలున్నాయ్. ఒకరినొకరు గౌరవించుకునే పరస్పర సన్నిహితత్వం ఉన్నది.

చాలామంది తెలుగుపెద్దలు రాష్ట్రపతులయ్యారు, గానీ బెంగాలీ వారిలో రాష్ట్రపతి సింహాసనమునకు వచ్చిన తొలి బెంగాలీ ప్రణబ్‌ముఖర్జీయే! కాంగ్రెసు నేతల్లో భీష్మాచార్యులువంటివాడు, సమస్యా పరిష్కారకుడు. వివాదరహితుడు. కేంద్రంలో అతడు చేబట్టని పదవులు లేవు. ఒక్క ప్రధానమంత్రి పదవి తప్ప, అన్ని బాధ్యతాయుతమైన పదవులన్నీ నిర్వహించి, ఒకేసారి శిరఃస్థానమైన రాష్ట్రపదవిని చేబట్టడడం తగిన సమయంలో తగిన స్థానమనే చెప్పాలి.

# 13వ రాష్ట్రపతిగా ప్రణబ్ ముఖర్జీ పదవీ స్వీకారం!

రాజకీయ పాలనలందు షష్ఠ్యబ్ది జరుపుకున్న ప్రణబ్‌ముఖర్జీ రాష్ట్రపతీ పదవీ స్వీకరణకు ముందు తిరుమల వెంకటేశ్వరుని లడ్డు ప్రసాదాన్ని భక్తితో స్వీకరించారు.

తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకమండలి అధ్యక్షులు కనుమూరి బాపిరాజు ప్రత్యేకంగా 'శ్రీవారి' లడ్డూ ప్రసాదములు తీసుకుని వెళ్ళి ఢిల్లీలో రాష్ట్రపతి పదవీ స్వీకారం చేసే ముందు ప్రణబ్‌ముఖర్జీకి అందజేశారు. ప్రణబ్ వేంకటేశ్వరునికి ప్రణతులు చేస్తూ, ప్రసాదాన్ని కళ్లకద్దుకుని స్వీకరించారు.


1.ఆయన రాష్ట్రపతి పదవికి నామినేషన్ పత్రాలు వేసే ముందు కూడా శ్రీవారి లడ్డు ప్రసాదం స్వీకరించే అభ్యర్థి పత్రాలు దఖలు పరిచారు. శ్రీవారి కృపా వీక్షణముల కారణంగానే ఆయన అత్యధిక ఓట్లను సంపాదించారు.

2.రాష్ట్రపతి ఎన్నికల రోజున శ్రీవారి పట్ల భక్తి ప్రపత్తులు, కృతజ్ఞులతో శ్రీవారి పాలక మండలి అధ్యక్షుడు కనుమూరి బాపిరాజుచే తొలి ఓటును (బోనీఓటు) వేయించిన తరువాతనే ప్రధాని మన్మోహన్ సింగ్, సోనియాగాంధీ, ప్రణబ్‌ముఖర్జీ, కేంద్రమంత్రులు, పార్లమెంటు సభ్యులు ఓటు వేయడం జరిగింది.

తెలుగు రాష్ట్రంలో ఉన్న విశ్వదేవుడు వేంకటేశ్వరుని అనుగ్రహం కారణంగా తిరుమల తిరుపతి దేవస్థానముల పాలకమండలి అధ్యక్షుడు రాష్ట్రంలోని కాంగ్రెసు నాయకుల్లో తలపండిన నాయకుడు కనుమూరి బాపిరాజుకు తొలిఓటు వేసే గౌరవం యివ్వడం ఎంతో సమంజసంగా, సంతోషకరమైన విషయం.

### -విశ్వయోగి విశ్వంజి శుభాశీస్సులు-

**విశ్వప్రేమికుడు విశ్వయోగి విశ్వంజీ అమెరికా పర్యటనకు వెళ్ళేముందు 'ప్రణబ్‌జీ' రాష్ట్రపతి యవుతారనీ, తన శుభాశీస్సులు ప్రముఖాంధ్ర ద్వారా తెలియపరచమని, ఆశీర్వచనములు తెలియపరచమని ఆదేశించారు. ముందే ఆయన ప్రణబ్ విజయాన్ని గ్రహించారు.**



**రాష్ట్రపతి ఎన్నికల్లో తొలిగా ఓటువేసిన తెలుగు పెద్ద కనుమూరి బాపిరాజు దేశరాజకీయాల్లో కాంగ్రెస్‌తోనే ప్రారంభించారు. మంచి కార్యకర్త. ప్రణబ్ పదవీ స్వీకరణకు ముందు శ్రీవారి ప్రసాదమును స్వయంగా అందచేసిన తిరుమల తిరుపతి దేవస్థానము పాలకమండలి అధ్యక్షుడు. దైవసేవలో తాదాత్మత చెందుతున్న భక్తవరేణ్యుడు. రెండవ సారి కూడా అధ్యక్షుడు కాగలడని అంటున్నారు.**

### ప్రణబ్ గురించి పేజీలకు పేజీలు చెప్పవచ్చు! కానీ- సంక్షిప్తంగా:

| | |
|---|---|
| జననం,జన్మస్థలం: | 1935 డిసెంబర్ 11,మిరాటి,బీర్భుమ్‌జిల్లా, పశ్చిమబెంగాల్ |
| తల్లిదండ్రులు: | రాజ్యలక్ష్మి ముఖర్జీ, కామదా కింకర్ ముఖర్జీ |
| వివాహం: | 1957 జూలై13,భార్య సువ్రాముఖర్జీ |
| సంతానం: | ఒకకుమార్తె, ఇద్దరు కుమారులు |
| | షర్మిళాముఖర్జీ (కథక్ నృత్య కళాకారిణి) |
| | అభిజిత్ ముఖర్జీ (బెంగాల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే) |
| | ఇంద్రజిత్‌ముఖర్జీ |
| విద్యార్హతలు: | ఎంఏ (హిస్టరీ), ఎంఏ (పొలిటికల్ సైన్స్),ఎల్‌ఎల్‌బీ,డీ.లిట్ |
| పార్టీ: | భారత జాతీయ కాంగ్రెస్‌లోనే రాజకీయ ప్రవేశం |
| అవార్డులు: | 2011-బెస్ట్ అడ్మినిస్ట్రేటర్ ఇన్ ఇండియా |
| | 1997-ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు |
| | 2008-పద్మ విభూషణ్ బిరుదం |

***నిర్వహించిన పదవులు...***

1969 జూలైలో తొలిసారిగా రాజ్యసభకు ఎన్నిక
1975,81,93,99ల్లో రాజ్యసభకు మళ్లీ ఎన్నిక
1980-85 వరకు రాజ్యసభ నాయకుడిగా ఉన్నారు
1973-74 పరిశ్రమల, షిప్పింగ్, రవాణా ఉపమంత్రి
1974-75 మధ్య కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి
1975-77కేంద్ర రెవెన్యూ, బ్యాంకింగ్ మంత్రి
1980-82 కేంద్ర వాణిజ్యం, ఉక్కు, గనుల మంత్రి
1982-84కేంద్ర ఆర్థిక మంత్రి
1991-96ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు
1993-95కేంద్ర వాణిజ్యమంత్రి
2012 వరకూ అనేక మంత్రి పదవులు

***రచించిన పుస్తకాలు:***

మిడ్మిటర్మ్-1969.
బియాండ్ సర్వైవల్: ఎమర్జింగ్ డైమెన్షన్స్ ఆఫ్ ఇండియన్ ఎకానమీ-1984
ఆఫ్ ద ట్రాక్-1987
సాగా ఆఫ్ స్ట్రగుల్ అండ్ సాక్రిఫిక్స్మస్ -1992
చాలెంజెస్ బిఫోర్ ద నేషన్-1992
ప్రణబ్ అదృష్టసంఖ్య-13

# ఆయనొక్కరే పరమాచార్య!
# ఆయన్నే నడిచే దేవుడనేవారు!

## - ఆయన ఆశీర్వచనంతోనే ఆధ్యాత్మిక రచనకు అంకురార్పణ జరిగింది!!



ఏ బిరుదములు వచ్చినా, ఏ సత్కారములు జరిగినా, ఏ దేశమేగినా, నాకూ, నా కలానికీ 'ప్రముఖాంధ్ర'కు మన్నిక కలిగినదంటే దానిక్కారణం ఈ పుటలో ఉన్న నడిచే దేవుడు, కంచి పరమాచార్యగా లోక ప్రసిద్ధి నొందిన కంచి కామకోటి పీఠాధిపతులు జగద్గురువు పరమహంస, పరివ్రాజకాచార్య శ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వాములవారు.


రెండున్నర దశాబ్దముల క్రితం జగద్గురువులు పుష్పగిరి శంకరాచార్య వారితో కలిసి కంచి మఠంలోని పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర స్వామి వారి దర్శనం చేసుకున్నాను. మాతో వేద పండితులు హరిసాంబశివశాస్త్రి వారి సోదరులు కూడా వచ్చారు. అపుడు పరమాచార్య మౌనదీక్షలో వున్నారు. మేనాలో (పల్లకి) కూర్చుని ఉన్నారు. పుష్పగిరి పీఠం పెద్దది కాబట్టి తమ అంతే వాసిని పిలిచి, బంగరు జరీ కాశ్మీర్ శాలువాతో సత్కరించారు. అనన్తరమ్ వారు వచ్చిన కార్యం గూర్చి సంస్కృతంలోనూ, సంజ్ఞలతోనూ చర్చించుకున్నారు. అనన్తరం నన్ను చూచి, దగ్గరకు రమ్మని సంజ్ఞ చేసి, ఆశీర్వదిస్తూ- ఈ ప్రక్క వారి చిత్రంతో ఉన్న కుంభకోణం అద్వైత సభ స్వర్ణోత్సవ సందర్భమున (1895 సం॥ములో వారు స్థాపించినదే) వెలువరించిన స్వర్ణోత్సవ సంచికను తీసి, ఒక్కొక్క పుటనే స్పృశిస్తూ నా వైపు కరుణా పూర్వకముగా చూస్తూ, అన్ని పేజీలను అలాగే స్పృశించిన తరువాత, దోసిట పట్టమని నా చేతులందచేసి ఆశీర్వదించారు. అది పూర్తిగా సంస్కృత వ్యాసాలతో ఉన్న ప్రత్యేక సంచిక. ఒకటో రెండో ఆంగ్ల వ్యాసాలున్నాయ్. అప్పటికి ఆ సంచిక చాలా పురాతన సంచికగా ఉన్నది. గట్టిగా పట్టుకుంటే పేజీలు పొడుంపొడుం అయిపోతుందేమో నన్న భయంతో పట్టుకున్నాను. నాకు పొట్టకోసిననూ ఒక సంస్కృత అక్షఱం తెలియదు. వావిళ్ళవారి దగ్గర త్రిలిఙ్గ వార పత్రికలో పనిచేసినప్పుడు అక్కడున్న సంస్కృత గ్రంథాలను పైపైనే చూసేవాణ్ణి. ఆ రోజు ఆ వేళా విశేషమేమో నలుగురు వేద పండితులుండగా నాకే ఆ సంస్కృత సంచికను యివ్వడం వచ్చిన వారికీ ఆశ్చర్యం కల్గించింది.

అన్నట్నుంచీ పురాణేతి హాస వ్యాసంగం మీదకు నా దృష్టి మరలింది. అప్రయత్నంగా నా కలం నుంచీ సంస్కృత పదాలు వెలువడడం ప్రారంభమైంది. ఆ ఉత్సాహ ఉత్తేజమే సనాతన ధర్మ హితైషిక వ్యాసాలను వ్రాసే 'ప్రముఖాంధ్ర'కు పునాదులు వేసింది. వారి ఆశీర్వచనాంతరార్థం ఏమోగాని, పండితులూ, కవులూ,విద్యావంతుల సరసన కూర్చున్నట్టు, ప్రముఖాంధ్రను ఆ దశాదిశగానే ధర్మపథంగా నడపడానికి కారణమైంది. 'ప్రముఖాంధ్ర'ను ఈ విధంగా ప్రారంభించడానికి, ప్రేరణ యిచ్చినవాడు నా 'జ్యేష్ఠకుమారుడు వేంకటేశ్వరరావు'. వాడు రామకృష్ణామిషన్ ఉన్నత పాఠశాలలో చదివాడు. వివేకానంద, రామకృష్ణుల సాహిత్యమంతా వంట బట్టించుకున్నాడు.


వయసు మలుపు తిరుగుతున్న దశలో నా కలం పంట పొలంలోని హలంలా, ప్రాచీన కవుల గంటంలా నడవడానికి కంచి పరమాచార్య శ్రీశ్రీశ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారి ఆశీస్సులే కారణం. వారికి 'గోటేటి' వంశీయులు ఎంతో అభిమానం.

నూరేండ్లు జీవించి, అద్వైత ప్రచారాన్ని సాగిస్తూ, కాలినడకనే కన్యాకుమారి నుంచీ కాశ్మీర్‌వరకూ పర్యటించి మహానుభావుడు, దండకారణ్యంలో వారు వెడ్తున్నపుడు బందిపోట్లు కూడా వారికి పాదనమస్కారం చేసారు.

## అమెరికా పర్యటన కేగిన విశ్వయోగి విశ్వంజీ!




అమెరికా వెడుతూ ఆయన చెన్నయ్‌లో రెండు రోజులున్నారు. తరలివచ్చిన భక్తులందరికీ బొట్టుపెట్టి, విభూతి ప్రసాదములిచ్చి ఆశీర్వదించారు. ప్రణబ్ ముఖర్జీ రాష్ట్రపతిగా ఎన్నికవుతారని ముందుగానే శుభాశీస్సులు 'ప్రముఖాంధ్ర' ద్వారా తెలుపమన్నారు.



ఉపేంద్ర చివుకుల కాంగ్రెసు సభ్యునిగా (పార్లమెంటేరియన్) ఎన్నికై, తెలుగు వారి పేరును నిలపాలని ఆశీస్సులనందచేయమని చెప్పారు.

న్యూజెర్సీలోని తెలుగు కుటుంబాలు అగ్ని ప్రమాదానికి గురై, సర్వమూ కోల్పోయినపుడు చివుకుల హృదయం చివికి, సహాయ కార్యక్రమం చేబట్టినందుకు 'ప్రముఖాంధ్ర' మనసారా అభినందిస్తున్నది.

# పదవులకెగబడిన రాజకీయవేత్త ఆచార్య ఎన్.జి.రంగా రైతు ఉద్యమనాయకుడు!

భారత స్వాతంత్ర్య సమరయోధులుగా, రైతు జన బాంధవులుగ, సుదీర్ఘకాలం పార్లమెంటు సభ్యులుగా, సేవలందించిన, గోగినేని రంగా 1900 నవంబర్ 7న నిడుబ్రోలులో, రైతుకుటుంబానికి చెందిన నాగయ్య, అచ్చమ్మగార్ల ప్రథమ సంతానంగా జన్మించారు. ప్రాథమిక , హైస్కూలు విద్య స్వగ్రామంలోనే పూర్తిచేశారు. హైస్కూల్ విద్యార్థిగ వున్నప్పుడే సాంఘిక రాజకీయ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు జాతీయ నాయకురాలు అనిబెసెంట్ అరెస్ట్‌కు నిరసనగా, నిడుబ్రోలు పరిసర గ్రామాల్లో పెద్ద యెత్తున ఊరేగింపులు, బహిరంగ సభలు జరిపారు. గుంటూరులోని ఆంధ్ర క్రిస్టియన్ కాలేజిలో, ఎఫ్.ఎ (నేటి ఇంటర్మీడియేట్ చదివారు).

ప్రముఖ పారిశ్రామికవేత్త వెలగపూడి రామకృష్ణగారి ఆర్థిక సహకారంతో 1920లో ఇంగ్లండ్ వెళ్లి ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో, చేనేత పరిశ్రమ, చేనేత కార్మికుల పరిస్థితులను అధ్యయనం చేశారు. రైతాంగ వ్యవహారాలు, వ్యవసాయ రంగంలోని పరిస్థితులను లోతుగా అధ్యయనం చేశారు. రాజకీయ శాస్త్రంలోనే కాక, అర్థశాస్త్రం పట్ల అత్యంత ఆసక్తితో లండన్‌లో అధ్యయనం చేశారు. అక్కడే వివిధ అంశాల పట్ల ఆసక్తితో ప్రజాస్వామ్య సౌమ్యవాద సిద్ధాంతాలను కూడా అధ్యయనం చేశారు. ఐరోపా దేశాలలో పలుమార్లు పర్యటించి, రైతాంగాన్ని వృత్తిదార్లను సంఘటిత పరిచేందుకు గట్టి కృషి చేశారు. 1925లో "కలోనియల్ అండ్ కలర్డ్ పీపుల్స్" శీర్షికతో రంగు జాతుల ఆర్థిక, సాంఘీక స్థితులపై పరిశోధన గ్రంథం రచించారు. 1927-30 మధ్య మద్రాసు లోని పచ్చ యప్ప కళాశాల ఆర్థిక శాస్త్ర ఆచార్యులుగా పనిచేశారు. 1928-29లో మద్రాసు ప్రభుత్వం "రిసెటల్‌మెంట్ శిస్తు విధానంపై సింగల్ మెంబర్ కమిటీగా **రంగా** నియమింపబడినారు. వెంకటగిరి జమీందారిలో, వెంకట్రామానాయుడు, కటికనేని సోదరులు, పొణాకా కనకమ్మగార్ల అభ్యర్థనపై జమీందారీ రద్దు కోసం తీవ్రంగా ఉద్యమించారు. 1934 నుండి దక్షిణ భారతంలో ప్రధానంగా ఆంధ్ర ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద రైతు రక్షణ యాత్రలు నిర్వహించారు. 1936లో 'ఫైచ్పూర్'లో జరిగిన అఖిల భారత కిసాన్ సభకు అధ్యక్షత వహించారు. రాయలసీమ, పల్నాడు శ్రీకాకుళం ప్రాంతాల కరువు నివారణకు పూనుకున్నారు. పంటలకు పశువులకు భీమా పథకం వర్తింపచేయాలని, కంట్రోళ్లు పర్మిట్ల పద్ధతిని రద్దు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధరలు లభింప చేయాలని రైతు సంఘాల ద్వారా ఆందోళన చేపట్టారు. 1930లో స్వరాజ్యపార్టీవారు కేంద్రశాసన సభనుండి వైదొలిగారు. ఆ స్థానంలో రంగా కాంగ్రెస్ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడినారు. 1930 నుండి 1947 వరకు కేంద్రశాసన సభ్యులుగా పనిచేశారు. 1946 నుండి 1950 వరకు రాజ్యాంగ సభ సభ్యులుగా కొనసాగారు.

భారత స్వాతంత్ర్య సమరంలో పాల్గొని అరెస్ట్ అయ్యారు. 1942లో క్విట్ఇండియా ఉద్యమంలో పాల్గొని, వేలూరు, అమరావతి, తంజావూరు జైళ్లలో శిక్ష అనుభవిస్తూ, అక్కడ రాజకీయ ఖైదీలకు, జాతీయ ఆర్థిక, సాంఘీక, రాజకీయ సిద్ధాంతాలపై యువకులకు శిక్షణనిచ్చారు. 1937లో 'వాహిని' వారపత్రిక ప్రారంభించి సంపాదకులుగా, రైతాంగవాణిగా దానిని పెంపొందించారు.

1945లో, గాంధీజీని కలుసుకొని కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించి గాంధీజీ అమోదాన్ని పొందారు. కమ్యూనిస్టు సిద్ధాంతానికి ప్రత్యమ్నాయంగా, ఆ సిద్ధాంతాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం చేశారు. 1946 నుండి 1951 వరకు మూడుసార్లు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా , కొంతకాలం కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సభ్యులుగా పనిచేశారు. 1952లో కృషికార్ పార్టీ స్థాపించి దానికి అధ్యక్షులైనారు. కొంతకాలం రాజ్యసభ సభ్యులుగా పనిచేశారు. 1955లో ఐక్యకాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభకు ఎన్నుకొనబడినారు.



విశ్రాంతి యెరుగని పోరాట వీరుడు ఆచార్య ఎన్.జి.రంగా

1962లో సహకార వ్యవసాయ విధానంలో ప్రభుత్వాన్ని ఎదిరించి కాంగ్రెస్ పార్టీ నుండి వైదొలిగారు. రాజగోపాలాచారి నాయకత్వంలో స్వతంత్ర పార్టీ స్థాపించారు. స్వతంత్ర పార్టీ అధ్యక్షులుగా, 1962లో స్వతంత్ర పార్టీ పార్లమెంటరీ పక్షనాయకులుగా ఎన్నికై ప్రతిపక్షనాయకులుగా నియమితులైనారు. 1972-80 మధ్య పలుమార్లు విదేశీయాత్ర చేశారు. గాంధీ శాంతి సంఘ సభ్యులుగా ప్రపంచ పర్యటన సాగించి ప్రపంచ శాంతికి, ప్రజాస్వామ్య విజయానికై గాంధేయ మార్గమే ఉత్తమమైనదని ప్రచారం చేశారు. ఇందిరాగాంధీ ప్రచారం చేసిన 'గరీబ్‌హఠావో' నినాదాన్ని బలపరుస్తూ కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభకు ఎన్నుకోబడినారు.

1982లో అరవై యేళ్ళ పార్లమెంటరి జీవిత మహోత్సవం స్పీకర్ బలరామ్ జక్కర్ అధ్యక్షతన జరిగినపుడు ప్రధాని ఇందిరాగాంధీగారి నుండి జ్ఞాపికను అందుకొన్నారు. చాలాకాలం పార్లమెంటు సభ్యునిగా పనిచేసి, గిన్నీస్ రికార్డు కెక్కారు. కేంద్ర ప్రభుత్వం నుండి 'పద్మవిభూషణ్' పురస్కార మందుకున్నారు. వయోజన విద్యా ఉద్యమంలో గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారితో పాటు కృషి చేశారు. రంగా గారు గొప్ప వక్తగానేగాక, ప్రముఖ రచయితగా పేరు గడించారు. "ఆధునిక రాజ్యాంగ సంస్థలు" జాతీయ విప్లవ పంథా, కిసాన్ ఉద్యమ చరిత్ర ఇంగ్లీష్‌లో క్రెడో ఆఫ్ వరల్డ్ వెజెట్రి, దిస్టంగ్విష్డ్ అక్వేన్‌టెన్స్ , ఆంగ్ల గ్రంథాలను భారత జాతీయ నాయకుల సంగ్రహ చరిత్రను రచించారు.

పార్లమెంట్ సమావేశాలకు రంగాగారు పాదచారిగా వెళ్లేవారు. రంగాగారి భార్య భారతీదేవి రంగా లండన్‌లోని రస్కన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో ఉన్నత విద్య నభ్యసించారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని కారాగారశిక్ష అనుభవించారు. కస్తూరిబా స్మారక సంఘ సభ్యురాలుగా సేవలందించారు.


రంగాగారు జీవితాంతం ప్రజాసేవ దేశసేవలో అవిశ్రాంతంగా పనిచేసి 95ఏట 1995 జూన్ 8వ తేదీన దివంగతులైనారు.

– జానుమద్ది హనుమశాస్త్రి

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels.yahoo.co.in, Grams : "MAYURA"



# జాతీయ జెండా నేత పింగళి వెంకయ్య

## భారతజాతిలోనే అసాధారణనేత

పింగళి వెంకయ్యగారు అసాధారణ వ్యక్తి, అసత్యం పలుకని వాడు. ఆత్మగౌరవానికి అత్యంత విలువ యిచ్చేవాడు. మునగాల జమీందారు నాయని వెంకటరంగారావు గారితో వెంకయ్యగారికెంతో పరిచయం ఉన్నప్పటికినీ జమీందారుగారు వెంకయ్యగారితో వ్యవహరించిన తీరు నచ్చలేదు. తొలితరం నాయకులతో వెంకయ్యగారికి మంచి పరిచయం ఉండేది. అనిబిసెంట్, దాదాబయ్‌నౌరోజీ, బిపిన్‌చంద్రపాల్ వంటి తొలితరం దేశనాయకులు వెంకయ్యగారి నెంతగానో గౌరవించేవారు. జాతీయోద్యమస్ఫూర్తికి ఒక పతాకాన్ని రూపొందించాలనే అభిప్రాయం ఎంతకాలంగానో ఉన్నది. ఆయన పట్టువీడకుండా భారతజాతీయ కాంగ్రెసు జరిపే సమావేశాలన్నిటిలోనూ ప్రతిపాదించేవారు. ఇలా పది పదిహేను సమావేశాల్లో ప్రతిపాదించి ఉంటారు.ఇరవయ్యో శతాబ్దం తొలితరం నాయకులందరూ ఆయన పట్ల అపార గౌరవాన్ని చూపేవారు. పరమాద్భుత జీవితాన్ని గడిపారు. మహామేధావి, గొప్పదేశభక్తుడు, ఒకసారి ఓ జాతీయ సమావేశంలో బ్రిటీష్ రాజరికపు పతాకాన్ని ఆవిష్కరించారు. అది తగదని వెంకయ్యగారు నిరసన తెలిపారు. వెంకయ్యగారెంత సౌమ్యుడో అంతటి సాహసి, జ్వలితభావకుడు, పదిహేడేళ్ళ వయసులోనే దక్షిణాఫ్రికాలోని బోయర్ యుద్ధంలో స్వచ్ఛంద సేవా వలంటీర్‌గా పనిచేశారు. అప్పుడే ఆయన దేశ సరిహద్దులు దాటి, దక్షిణాఫ్రికా వెళ్లారు.

కొలొంబోలో సీనియర్ కేంబ్రిడ్జి పరీక్ష వ్రాసి ఉత్తీర్ణులయ్యారు. లాలాహంసరాజ్, లాలలజపతారాయ్ ఆదిగాగలవారు లాహోర్‌లో స్థాపించిన దయానంద్ ఆంగ్లో వేదిక సంస్థలో పనిచేశారు. వెంకయ్య రాష్ట్ర భాష తెలుగు, దేశభాష హిందీ, గీర్వాణ భాష సంస్కృతం అంటే ఎంత ఇష్టమో, అన్యభాషల పట్ల కూడా ఆయనకంత అభిమానం, నేర్చుకోవాలనే కుతూహలమూ ఉండేవి. తాను పనిచేస్తున్న విద్యాసంస్థకు ప్రొఫెసర్ 'గోటే' అనే విద్వాంసుణ్ణి ఆహ్వానించి ప్రొఫెసర్ ఉద్యోగం యిచ్చారు. వెంకయ్యగారు ఆయన్ను పరిచయం చేసుకుని, ఆయనకు తాను సంస్కృతం నేర్పుతూ తాను ఆయన్నుంచీ జపాను భాషను నేర్చుకున్నారు. ఏదైనా కొత్త విషయమున్నపుడు దాన్ని నేర్చుకుని కరతలామలకం చేసుకుంటారు. ఆయన వ్యవసాయ విజ్ఞాన శాస్త్రంలో దిట్ట. కాంబోడియా పత్తిని భారతదేశానికి పరిచయం చేసింది ఆయనే! పంటల అధిక దిగుబడికి ఎన్నో ప్రయోగాలు చేసారు. ప్రయోగాలు అనే కన్న ప్రయత్నం అంటేనే సమంజసంగా ఉంటుంది. బందరులో ప్రసిద్ధి చెందిన జాతీయ విజ్ఞాన కళాశాలలో వ్యవసాయ విజ్ఞాన ఆచార్యులుగా పనిచేశారు. భారత కోకిల, సుప్రసిద్ధ రచయిత్రి, జాతీయ నాయకురాలైన సరోజినీ నాయుడు గారి తండ్రి అఘోరనాధ చటోపాధ్యాయగారితో చక్కని స్నేహం ఉండేది. వెంకయ్యగారు హైదరాబాద్ వచ్చినప్పుడల్లా వారింట్లోనే బసచేసేవారు. ఛటర్జీగారు మంచి రసాయనవేత్త, వెంకయ్యగారు విజ్ఞానవేత్త. వారిరువురికీ 'పరశువు' బంగారం తయారుచేయాలనెడి సంకల్పం ఉండేది. పాదరసంతో బాటు మరి కొన్ని రసాలను చేర్చి బంగారం తయారుచేయాలని తలంచారు. (ఆ రోజుల్లో చాలామంది ఈ బంగారం తయారీ చేసినవారే! చారిత్రక ఆధారాలు కూడా ఉన్నాయ్).

పింగళి వెంకయ్యవంటి మహామేధావులు నిరాడంబరులు, విజ్ఞానవేత్తలు చాలా అరుదుగా పుడతారు. ఆయన ఆంధ్రుడవడం వల్లనో ఏమో–జాతీయ గౌరవాలు దక్కలేదు. చివరి కాలంలో భృతి కూడా కష్టమైపోయింది. ఒక చక్కని ఇల్లును కూడా సంపాదించుకోలేకపోయారు. పిల్లలకు కూడా ఏవీ చేర్చిపెట్టలేని జీవితమైంది. పరమేశ్వరా! త్యాగమూర్తుల జీవితం దుఃఖాంతమేనా? అని ప్రశ్నిస్తూ, ప్రశాంత ప్రభాతవేళనైనా ఆంధ్రులొక్కసారి పింగళి వెంకయ్యను తలచుకోండి అంటూ అభ్యర్థిస్తున్నాను.

## జెండా మన ఉన్నతికి ఎజెండా

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగానే గాకుండా దేశమంతా జెండా ప్రతిరోజూ మన ఇంటిమీద ఎగురుతూ ఉండాలి. అది మన ఉన్నతికి సంకేతం, ప్రగతికి మూలం, స్వేచ్ఛకు నిదర్శనం. పూర్వం మహారాజులు తమ రథాలకు జెండా కట్టనిదే వెళ్లేవారు కాదు. జెండా నేలకు ఒరిగితే దానిని అపశకునంగా భావించేవారు.

జెండాను అవమానపరచేవారిని మాత్రం క్షమించేవారుకాదు. మనదేశ జెండా కేవలం మన దేశానికే కాక విశ్వానికంతటికీ శాంతి సౌఖ్యాల్ని, విశ్వమానవ సౌభాతృత్వాన్నీ, సస్యశ్యామలతనూ ప్రబోధించే పరమార్థం దాగి ఉన్నది. పతాకం మధ్యలో ఉండే ధర్మచక్రం ఆధ్యాత్మిక భావాలను ప్రబోధిస్తుంది. దానికున్న 24 రేకులు 24 తత్వాలకు ప్రతీక. ఆపదల నుండి రక్షించే 24 మహాభీజాక్షరాలు గల గాయత్రీ మంత్రమే ఆ రేకులు.

జెండాలో పైనున్న కాషాయరంగు, "విషయభోగాల పట్ల విరక్తిగా ఉండు. త్యాగసంస్కృతే విశిష్టమైనది. భోగసంస్కృతి విపత్కరమైనది సుమా!" అని చెబుతుంది. "అందరూ సత్యగుణాన్ని అలవరచుకుంటే, అదే శాంతిసౌఖ్యాల్ని కలిగిస్తుంది. మన మనస్సు నిర్మలంగా ఉంటే అందరూ మన పట్ల నిర్మలంగా ఉంటారు. అప్పుడు ఈ ప్రపంచం సోదరసోదరీ భావాల మయం అవుతుంది" . రెండూ సిద్ధించినపుడు మనకు అంతా సస్యశ్యామలమే. "దేశాన్ని పచ్చదనంగా తీర్చిదిద్దండి" అని చెబుతోంది అకుపచ్చ. పచ్చదనం– పరిశుభ్రత అనే విశేషాన్ని జెండా లోని ఆకుపచ్చ, తెలుపురంగులు మనం రక్షించుకొంటే ప్రకృతిని మనమంతా ఆరోగ్యవంతులమైనట్టే.

ఇలా అర్థవంతమైన మన పతాకాన్ని చేకూర్చిన మహనీయుడు శ్రీపింగళి వెంకయ్య. ఇంత అద్భుతమైన తత్వం ఉన్న జెండాకు ప్రతి ఒక్కరు రెండుచేతులారనమస్కరించాలి. ఒంటి చేత్తో నమస్కరిస్తే మనం పుట్టినప్పటి నుండి ఇప్పటి వరకూ చేసిన పుణ్యం అంతా నశిస్తుంది.

**జన్మ ప్రభృతి యత్సర్వ**
**చేతసా పుణ్యమార్జితమ్**
**తత్సర్వం విలయం యాతి**
**ఏకహస్తాభివందనాత్!**

అని వ్యాఘ్రపాద స్మృతి చెబుతోంది. అంటే మనం ఎవరికి ఒంటిచేత్తో నమస్కరిస్తామో, వారికి మన పుణ్యాలన్నీ వెళ్లిపోతాయట. కనుక రెండుచేతులూ జోడించి నమస్కారం పెట్టాలన్నాయి స్మృతులు. కాని జెండావందనంలో మాత్రం తప్పకుండా ఒంటిచేత్తోనే సెల్యూట్ చెయ్యాలి. మనదేశ సౌభాగ్యం కోసం ప్రతిఒక్కరమూ మన మన పుణ్యాల్ని ధారపోస్తున్నామన్నమాట. అప్పుడు జెండా మనం రక్షిస్తుందనడానికి ఇది ఒక నిదర్శనం.

నిజానికి మనకు స్వాతంత్ర్యం వచ్చిందని సంతోషిస్తే చాలదు. తెల్లవారి పాలన నుంచి విముక్తులమైనా, వారి భావాలూ, వారి వేషభాషలూ మనపై ప్రభావం చూపుతూనే ఉన్నాయి. భావదాస్యం ఒంటపట్టించుకొని మన ఇంద్రియాలకు మనం వశం కాకుండా, మనజీవితం సుఖశాంతులమయంగా తీర్చిదిద్దుకోగలిగితే అప్పుడే సత్యమైన స్వాతంత్ర్యం అనుభవించిన వారమౌతాం. జెండా ఊంఛా రహేహమారా!

# వందేమాతరమ్! త్యాగశీలురైన మహిళా నేతలు స్వాతంత్ర్యోద్యమంలో అసమాన పోరాటం చేశారు!

స్వాతంత్ర్య సంగ్రామంలో పురుషులకు దీటుగా మహిళలు పోరాడారు. ఈ మహిళామణులను స్మరించకుండా స్వాతంత్ర్య ఉద్యమ ప్రస్తావన చేయలేము. వీరిలో రాణి లక్ష్మీబాయ్, కిట్టూర్‌కు చెందిన రాణిచెన్నమ్మ, రాణి రుద్రమ్మ, అవధ్ రాణి బేగం హజ్రత్ మహల్ వీరందరూ 1857 స్వాతంత్ర సమరానికే పూర్వమే త్యాగదీక్షా శౌర్యాలతో పాల్గొన్నారు. తమ ప్రాణాలను అర్పించారు. వీరుగాక, మరికొందరు చరిత్రకు అందని మహిళా సాహస శౌర్యశీలురున్నారు.

వారి తరువాత గాంధీకి ముందూ తరువాత ఓ మహిళాతరం సహాయ నిరాకరణోద్యమంలోనూ, సత్యాగ్రహముల్లోనూ, మహిళా సంక్షేమానికి పాల్గొన్న వారున్నారు. దక్షిణాన దుర్గాబాయమ్మ దుర్గలా తన విశ్వరూపాన్ని చూపించింది. కాంగ్రెస్ సేవా వాలంటీర్‌గా పిన్నతనంలోనే కాకినాడ కాంగ్రెసు మహాసభలో నెహ్రూనే నిలదీసిన ధీరవనిత. ఆంధ్ర మహిళా సభను స్థాపించడమే గాకుండా అఖిల భారతీయ మహిళా సంక్షేమానికి అసమాన అమేయ కృషి చేసిన మహిళా శిరోమణి. గాంధీ, నెహ్రూ వంటి మహానాయకుల మెప్పు లందుకున్న ఆంధ్ర మహిళా రత్నం. ధైర్యానికి, స్థైర్యానికీ ధీరతకు 'దుర్గ' అనే సవ్యసాచియనే చెప్పాలి.



**ఝాన్సీ లక్ష్మీబాయి :** విదేశీయులపై పోరాడే సమయంలో పురుషుడి వలే దుస్తులు ధరించి గుర్రంపై వీర విహారం చేస్తూ, రెండు చేతులతోనూ కత్తిని తిప్పుతూ ఝాన్సీ లక్ష్మీబాయి తెగువ చూపించారు. ఈమె సాహసం మహిళలతో పాటు పురుషులకూ స్ఫూర్తినిచ్చింది. దేశభక్తి, సాహసం, ఆత్మగౌరవం వంటి లక్షణాలకు ఈమెనే చెప్పుకోవాలి.

**మేడం కామా :** తొలి జాతీయ పతాకాన్ని 1907లో జర్మనీలో ఎగురవేసి సంచలనం సృష్టించిన మేడం కామా స్వాతంత్ర్య సంగ్రామ కాలంలో కార్యకర్తలకు అన్నివిధాలా అండదండలిచ్చారు. మన జాతీయజెండాకు ప్రపంచవ్యాప్తంగా మద్దతునివ్వాలని ఈమె చేసిన విజ్ఞప్తికి ఆనాడు మంచి స్పందన లభించింది. ఎన్నో దేశాల్లో పర్యటించి స్వాతంత్ర్య సంగ్రామంపై స్ఫూర్తిని కలిగిం చిన మహిళామణి.

**హజ్రత్ మహల్ బేగం:** భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ కాలంలో ఎంతో చురుకైన పాత్ర పోషించారు. అప్పటి లక్నో పాలకుడు నవాబ్ వాజిద్ ఆలీ షా భార్య అయిన ఈమె బ్రిటీష్ పాలనను నిరసించారు. బ్రిటీష్ పాలకులు ఇచ్చిన గౌరవాలను తిరస్కరించారు.

**కస్తూర్బా గాంధీ:** కస్తూర్బా మహాత్ముడి సహధర్మచారిణి. దక్షిణాఫ్రికాలో అనేక సంవత్సరాలు భర్త వెన్నంటే ఉండి సేవాకార్యక్రమాలు నిర్వహించారు. స్వాతంత్ర సమరంలో మహిళా విభాగానికి నేతృత్వం వహించి, సత్యాగ్రహాలు నిర్వహించి జైలుకు వెళ్లారు. బీహార్ చంపారన్‌లో నీలిమందు పండించాలంటూ అక్కడి పనివారిని ఒత్తిడి చేస్తున్న బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా, గుజరాత్ కైరాలో పన్నుల చెల్లింపు వ్యతిరేక ఉద్యమంలో గాంధీజీ నిర్వహించిన పోరాటాల్లో భర్తకు చేదోడువాదోడుగా కస్తూరిబాయ్ నిలిచారు. గాంధీజీ దక్షిణాఫ్రికా నుంచి తిరిగివచ్చి 1915లో 'నీలిమందు' పోరాటాల్లో పాల్గొన్నప్పుడు ఆయనకు బాసటగా ఉన్నారామె. ఆంగ్లేయులు గాంధీజీని అరెస్ట్ చేసినప్పుడు కొన్నిసార్లు ఉద్యమాలకు ఆమే నాయకత్వం వహించేవారు.

**సరోజినీనాయుడు:** స్వాతంత్ర పోరాట యోధురాలైన సరోజినీ నాయుడును నైటింగేల్ ఆఫ్ ఇండియా అని పిలిచేవారు. దండి సత్యాగ్రహం సమయంలో గాంధీజీచేసిన పాదయాత్రలో ఆయన వెంట నడిచారామె. ఆ సమయంలో గాంధీజీని, కస్తూర్బాను, అబ్బాస్ త్యాబ్జీని అరెస్ట్ చేశాక నిర్వహించిన సత్యాగ్రహాలకు ఆమె నేతృత్వం వహించారు. స్త్రీల స్వేచ్ఛ, విద్యావకాశాల కోసం నిర్వహించిన పోరాటాలలో ఆమె పాలుపంచుకొన్నారు.

**ఉషా మెహతా:** ప్రముఖ స్వాతంత్రోద్యమ యోధురాలు. గాంధేయవాధి అయిన ఉషా మెహతా 1942లో క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో కొన్ని నెలల పాటు ఒక అజ్ఞాత స్టేషన్ నుంచి రహస్యంగా రేడియో కార్యక్రమాలను ప్రసారం చేశారు. అందుకే ఆమెను 'రహస్య కాంగ్రెస్ రేడియో' అని పిలిచేవారు. ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా 1998లో భారత ప్రభుత్వం ఆమెను 'పద్మవిభూషణ్' పురస్కారంతో ప్రభుత్వం సత్కరించింది.

**కమలా నెహ్రూ :** భారత మొదటి ప్రధాని పండిట్ నెహ్రూ జీవిత భాగస్వామి కమలా నెహ్రూ. 1921 నాటి సహాయ నిరాకరణ ఉద్యమంలో పాలుపంచుకున్నారామె. ఆ ఉద్యమంలో అలహాబాద్‌లోని మహిళా సంఘాలకు నేతృత్వం వహించి విదేశీ వస్త్రాలను విక్రయించే దుకాణాల ఎదురుగా పికెటింగ్ నిర్వహించారు. ఒకసారి పండిట్ నెహ్రూ ఒక ప్రసంగం చేయాల్సి ఉండగా దాన్ని నిరోధించడానికి బ్రిటిష్ పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. ఆ సమయంలో ఆ వేదిక వద్దకు వెళ్ళి ఆమే స్వయంగా ఆ ప్రసంగ పాఠాన్ని చదివారు. స్వాతంత్ర్యోద్యమంలో రెండుసార్లు జైలుకు వెళ్ళారు.

**అరుణా అసఫ్ ఆలీ:** వివాహం తర్వాత స్వాతంత్రోద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. అరుణా అసఫ్ అలీ. ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో భాగంగా జరిగిన అనేక సత్యాగ్రహ కార్యకలాపాల్లో పాలుపంచుకున్నారు. 1931 నాటి గాంధీ-ఇర్విన్ ఒడంబడిక ప్రకారం జైళ్లలోని రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేసి, ఈమెను మాత్రం 1932 వరకు తీహార్ జైల్లో ఉంచారు. ఆ సమయంలో జైలులోని రాజకీయ ఖైదీల పట్ల అధికారులు చూపుతున్న వివక్షతకు వ్యతిరేకంగా నిరాహారదీక్ష చేశారు. తీహార్ జైలులో ఖైదీల వసతులను మెరుగుపరచేందుకు ఆ దీక్ష ఎంతగానో ఉపయోగపడింది.

**విజయలక్ష్మి పండిట్:** మోతీలాల్ నెహ్రూ కుమార్తెగా, దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సోదరిగా ప్రజలందరికీ చిరపరిచితమైన విజయలక్ష్మి పండిట్ ఝాన్సీ లక్ష్మిబాయి, సరోజిని నాయుడు స్ఫూర్తితో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో బ్రిటీష్ పాలకులపై పలుసార్లు పోరాడారు. జైలుకు వెళ్లారు. భారత ప్రతినిధిగా పలు దేశాల్లో జరిగిన సదస్సుల్లో పాల్గొని భారతదేశ ఔన్నత్యం చాటారు. ఇలా ఎందరో మహిళామణులు పాల్గొన్నారు. వారందరికీ వందేమాతరం అందాం. ●

# మన దేశం గాంధీ పుట్టిన దేశమేనా!


'గాంధీ' లను పేర్లు చివరి చేర్చుకున్న అందరూ 'గాంధీ' వంశజులుకారు! 'గాంధీ' ఒక్కరే తన వారసులను రాజకీయాలందు అడుగిడనీయలేదు. నెహ్రూ వంశం ఒక్కడే కాంగ్రెసును పట్టుకుని పాలన కొనసాగిస్తూంది. చివరి రోజుల్లో నెహ్రూ అనారోగ్యవాతబడ్డారు. బ్రతికించాలని ఎంతో ప్రయత్నించిన డాక్టర్లు ఆశను విడనాడారు. నెహ్రూ మనసులో తన తరం వారసురాలుగా తన తనయ ఇందిరాగాంధీ తన పదవి చేబట్టాలనీ ఉడుంపట్టు పట్టారు. మొత్తానికి ఆయన గతించినా దేశంలో ఆ వారసత్వం కొనసాగుతూంది. రాహుల్ గాంధీలో ఆ ఆశాఛాయలు కనిపిస్తున్నాయ్.

వాస్తవానికి ఆ కాంగ్రెసూ లేదు, ఆ గాంధేయులూలేరు.

కాలం గడిచే కొద్దీ, సమాజం మారే కొద్దీ కొన్ని సిద్ధాంతాలు పాతబడిపోతాయి. కొందరు ప్రముఖులు కనుమరుగైపోతారు. మహాత్ముడికి మాత్రం ఈమాట వర్తించదు. ఆరు దశాబ్దాల తర్వాత కూడా, గాంధీ బోధనల ప్రాచుర్యం ఇసుమంతైనా తగ్గలేదు. నిజానికి వాటి అవసరం ఇప్పుడే ఎక్కువగా ఉంది. దేశంలో తీవ్రవాదం పెచ్చు పెరుగుతోంది. ఆర్థిక సంక్షోభం తరుముకొస్తోంది. పేదరికం వేధిస్తోంది. అవినీతి రాజ్యమేలుతోంది. నియంతృత్వం బుసలు కొడుతోంది. ప్రతిచోటా ఏదో ఒక సమస్య. బయటపడలేని పరిస్థితులు. అన్ని ప్రయత్నాలూ విఫలం అవుతున్నాయి. అన్ని దార్లూ మూసుకుపోతున్నాయి. అన్ని వ్యూహాలూ బెడిసికొడుతున్నాయి. ప్రపంచమంతా పరిష్కారాల కోసం గాంధీయిజం వైపు ఎదురుచూస్తూంది.

'నేను కొత్తగా బోధించాల్సిందేం లేదు. సత్యం, అహింస అనాది నుంచి వస్తున్నవే...' అని చెప్పినా ఆ సత్యాన్ని ఆ అహింసా సిద్ధాంతాన్ని హృదయాలకు హత్తుకునేలా వివరించిన ఖ్యాతి ఆయనదే.

విశ్వవ్యాప్తమైన గాంధీ ఫౌండేషన్లు అహింసా మార్గాన్ని జనంలోకి తీసు కెళ్తున్నాయి. అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు గాంధీయిజం సమకాలీనతను ప్రపంచానికి వివరిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడి శాంతి మంత్రాల్లో, ఆఫ్రికాలోని



కరుణమూర్తికి 'కరుణశ్రీ' సమర్పించిన నివాళి పద్యం...
'అతడొక పవిత్ర
ధర్మదేవాలయమ్ము
అతడొక విచిత్ర
విశ్వవిద్యాలయమ్ము
ఆ మహాశక్తి అంతయింతంచు
తూచజాల మతడొక
పెద్ద హిమాలయమ్ము'

మండేలా వంటి నాయకుల్లో అరబ్‌దేశాల ఉద్యమగీతాల్లో కూడా గాంధీయిజమే వినిపిస్తోంది. 'జాతిపిత' అని సంబోధిస్తే మహాత్ముడిని ఒక దేశానికో, ఒక జాతికో పరిమితం చేసినవాళ్లం అవుతాం. అయితే గాంధీ చేసిన పొరపాట్లు ఉన్నాయ్. దేశం రెండుగా చీలిపోవడానికి ఆయనే ఒక కారకుడు. కాంగ్రెసును దేశం పాలించ వద్దంటూనే ప్రోత్సహించారు. ●

# పూజ్యశ్రీ శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి శతజయన్తి స్మారక (విశేష సంచిక)



**2013** సంవత్సరము ఏప్రిల్ నెలలో విజయనామ సంవత్సరం, చైత్రమాసంలో జరుగనున్న పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి శతజయన్త్యుత్సవాలను పురస్కరించుకొని పూజ్యశ్రీ స్వాములవారిని గురించి ఒక విశేష సంచికను (శతజయన్తి స్మారికను) ప్రచురించాలని తలంచినాము. అందుకుగాను (1) శ్రీ సంపూర్ణానందగిరి స్వాములవారు (2) డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు (3) డా॥ పి.వి. అరుణాచలంగారు (రిటైర్డ్ ద్రవిడ విశ్వవిద్యాలయ ఉపకులపతి) (4) డా॥ కె.వి. సర్వోత్తమ్మరావుగారు (6) డా॥ కె.జె. కృష్ణమూర్తిగారు (6) డా॥ మల్లెల గురవయ్య గార్లను సంపాదకవర్గంగా శ్రీ శుకబ్రహ్మాశ్రమాధిపతులు శ్రీస్వాములవారు ఏర్పాటుచేశారు.

పై సంపాదకవర్గము 27-2-2012వ తేది సోమవారం సమావేశమై విశేష సంచిక ఈ క్రింది విషయాలపై రచనలతో వుండాలని తీర్మానించారు.

(1) పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి పర్యటనలో భక్తుల అనుభవాలు. (2) పూజ్యశ్రీ విద్యాప్రకాశానంద గిరిస్వాములవారి గీతాజ్ఞానయజ్ఞాలు శ్రోతలపై ప్రభావము (3) గీతామకరంద ప్రాశస్త్యము (4) శ్రీ స్వాములవారి ఇతర రచనల ప్రాశస్త్యము (5) టి.టి.డి.తో అనుబంధము (6) శ్రీ మలయాళ స్వాములవారి ఆశయాలను శ్రీస్వాములవారు సఫలం చేసిన విధానము (7) శ్రీస్వాముల వారి సామాజిక సేవ (8) శ్రీ కాళహస్తి క్షేత్రంలో శ్రీ శుకబ్రహ్మాశ్రమ స్థాపనము (9) శ్రీస్వాముల వారు స్థాపించిన భక్త కన్నప్ప ఉచిత కంటి ఆస్పత్రి విశిష్టత - సేవ (10) శ్రీస్వాములవారు శ్రీకాళహస్తిలో ప్రారంభింపజేసి నడుస్తున్న కళాశాలలో చదివిన విద్యార్థుల అనుభవాలు - భావాలు శ్రీ స్వాములవారిని గురించి.

ఈ పై విషయాలపై రచయితల నుండి వ్యాసాలు స్వాగతింపబడుచున్నవి. పై విషయాలతో పరిచయముగల రచయితలు తమ తమ వ్యాసాలను **'శ్రీ శుకబ్రహ్మాశ్రమము, శతజయన్తి సంచిక విభాగము, స్వామి విద్యాప్రకాశానంద నగర్, శ్రీ శుకబ్రహ్మాశ్రమం (పో), శ్రీకాళహస్తి, చిత్తూరు జిల్లా. ఆంప్ర.- 517 640** అను చిరునామాకు పంపగోరుచున్నాము.

ఇట్లు, కార్యదర్శి
**శతజయన్త్యుత్సవ సంఘం**



# ప్రాచీనాంధ్రులందరు అదృష్టవంతులు! అక్షరము రానివాడు కూడా ఆంధ్రమునే మాట్లాడేవాడు! - పానుగంటి వారి జంఘాల శాస్త్రి

ఆంధ్రుడువై యుండీ బ్రతుకు తెరువు కోసం ఆంగ్లము నేర్చుకొనుట భవ్యముగానే ఉన్నది. కానీ ఆంధ్రభాషలో మాట్లాడలేననుట ఎంత అవమానముగా నున్నదో! నీ తల్లితండ్రులు ఆంధ్రులే కదా! వారు మాట్లాడు భాష ఆంధ్రమే కదా! ఆంధ్రమున నీవు మాట్లాడకపోవుటకు కారణము నీ అశక్తి కాదు. నీలో ఆసక్తి లేకపోవడమే! నీలో పెంచుకున్న అనిష్టత, అసహ్యత, చులకనాభావం కారణం అనునది అక్షరాలా నిజం. ఆంగ్లేయుడు ఆంగ్ల పండితుడైన బ్రౌను దొరకన్న నీవు గొప్పవాడివా?



మాతృభాష నేర్చుకొనుటకు ఏమంత కష్టము కలదు? ఉగ్గుపాలతోనే అది అలవడును. నీ నరనరములలో ఆంధ్రభాష ఇమిడియున్నది. నీవు ఇపుడు కొత్తగా నేర్చుకొనుట ఏమి? నా మాతృభాష నాకు రాదని పలుకువాడెవడునూ ఉండడు. ఆంధ్రదేశము, ఆంధ్రభాష ఆంధ్రజాతి పుట్టి ఎంతో కాలమైనది. ఇట్టి తగనివాక్యము నీ నోటి నుండి వింటిని.

భాష నేర్చుకొనుటకు మీరే ప్రయత్నము చేసినారు? తెలుగు భాషాగ్రంధము మీకు తలక్రింద దిండుగా నైనా పనికి రానప్పుడు భాషా జ్ఞానము మీతలలో నెట్లు దూరును? చదివినను భాష రానివాడెవ్వడు? ఆంధ్రుడై పుట్టి, ఆంధ్రభాష నేర్చుకుని, భాష రాక భ్రష్టుడైన వాడెవడుండును? భారత, భాగవత రామాయణములు పఠింపని నీవు బారిష్టరువైననేమి? ప్రజాపతివైననేమి? ఆంధ్రుడవై ఏల పుట్టితివోయీ- అని జంఘాల శాస్త్రి పాత్రద్వారా పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారని పించారు.

1865 సం॥ములో జన్మించిన పానుగంటివారు మాతృభాషాభిమాని. భాష నేర్చుకొనే నియమములు సూక్ష్మముగా తెలుపుచూ, దినమునకు ఒక్కసారి 15 నిముషములు కుటుంబములోని వారితో కలిసి, రాత్రి భోజనము చేసిన పిమ్మట ముచ్చటించుకొనుచు ఆంధ్ర పత్రికను చదువవలెను. (ఆనాడు తెలుగు వారికోసమై తెలుగు భాషా సేవ చేసిన పత్రిక అదొక్కటే. తెలుగు పదములతో నడుపబడుతూ, తెలుగువారి భాషా ఔన్నత్యమును చాటిన ఏకైక పత్రిక ఆంధ్రపత్రిక) ఆంధ్రభాష బొత్తిగా రాని ఆంధ్రునితో ఆంగ్ల భాషలో ఎన్నడునూ మాట్లాడకూడదు. మిత్రులకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మొదట డియర్ ఫ్రెండుయనీ, వ్రాయకుండా, బ్రహ్మశ్రీ అనిగానీ, మహారాజశ్రీ అనిగానీ ప్రారంభించవలెను, చివరగా ఆంగ్లంలో **యువర్స్‌ట్రూలీ** వ్రాయకుండా **చిత్తగింపవలెను** అని ముగింపవలెను. ఆంధ్రభాష తెలిసిన వారికి ఆంగ్లములో ఉత్తరములు వ్రాయకూడదు. నూతనముగా వచ్చు గ్రంథములన్నియు చదువవలెను. స్వభాషాపత్రికలను చదవకుండా విసిరి వేయడం కూడదు. ఈ చిన్న నియమాలను పాటించి మాతృభాషాభిమానులు కావలెను అని పానుగంటివారు శతాబ్దం క్రితమే తెలుగు భాషా ముందు తరాల్లో కూడా ప్రవర్ధమానంగా స్వభాషారాధనం కొనసాగాలని భావించారంటే, ఆయన మాతృభాషా అనాసక్తిని ముందే గ్రహించారు. ఈనాటి మాతృభాషా మసగబాటును ఆనాడే గ్రహించి, జంఘాల శాస్త్రి ఉపన్యాసముల ద్వారా 'సాక్షి' గ్రంథములో వివరించారు. అలాగే జంఘాల శాస్త్రిచే అంత అదృష్టము కలుగునా, లేక గుండెలు పగిలిపోవునట్లు దుర్వార్త విందుమా- అని కూడా అనిపించారు. ఆ రోజుల్లో 'ఆంధ్రపత్రిక'లో వచ్చిన సాక్షి వ్యాసాలను గ్రంధ రూపేణా బహు సంపుటములుగా, సంఘములో సంభవించు అవిక్రమ వక్రమాలను ఎన్నో వివరించారు. తెలుగులో ఎన్నో ముద్రణలు పొందిన గ్రంధము 'సాక్షి', విశ్వనాధ సత్యనారాయణగారి 'వేయిపడగలే'! వీటికి సాటి రాగల గ్రంధాలు మరల రాలేదు. ఆ కాలంలోనే పానుగంటి గారిని అందరూ ఆంధ్రా ఎడిసన్, ఆంధ్రా షేక్స్‌పియర్ అభినవ కాళిదాసు యనే బిరుదములతో కీర్తించారు. ఆయన రచించిన పాదుకాపట్టాభిషేకం, విప్రనారాయణ, రాధాకృష్ణ నాటకములు వేల ప్రదర్శనములు ప్రదర్శింపబడడమే గాకుండా పద్యములు శ్రవణ మనోహరంగా ప్రాచుర్యమందాయ్. ●

## అప్పట్లోనే ఆంధ్రము మాట్లాడుట రాదనెడి రోగమున్నదా? పానుగంటి వారు భవిష్యత్తునూహించి వ్రాసిరా? ఏదైన కానిండు!

ఒక పాఠశాలలోని తెలుగు విద్యార్థులు ఒక సమావేశము నేర్పాటు చేసుకొనిరి. ఆ సమావేశమునకు అధ్యక్షునిగా ఒక న్యాయవాదిని ఆహ్వానించిరి. అధ్యక్షుడైన అ న్యాయవాది ఆంధ్రుడే! ఆయన ఆంధ్రమున ఉపన్యసించకుండా, ఆంగ్లములో ఉపన్యసించుట సభలోని జంఘాల శాస్త్రికి కలిగిన అయిష్టతను తెలుపుచు ఇట్లు పలికెను:

సభికులారా! ఇతడు ఒక న్యాయవాది. అచ్చమైన ఆంధ్రుడు. పండిత వంశములో పుట్టినవాడు. ఇట్టివాడు నాకు ఆంధ్రభాషలో మాట్లాడుట రాదని పలుకుట పరిహాసముగా ఉన్నది. ఇటువంటి మాటలు వినలేని పరమపదము చేరిన ప్రాచీనాంధ్రులందరూ అదృష్టవంతులు. మనమందరమూ దురదృష్టవంతులము. ఆంధ్రుడై ఉండీ, ఆంగ్లమునభ్యసించినంత మాత్రమున ఆంధ్రభాషలో మాట్లాడలేననుట అవమానకరముగానున్నది. ఇతడు మాట్లాడలేకపోవుటకు కారణము అశక్తి కాదు. అనిష్టత, అసహ్యత. ఇది ముమ్మాటికి నిజము. ఇతడు బ్రౌను దొరకు మించిన ఆంగ్ల పండితుడా?' అని తన నిరసనను తీవ్రముగా వ్యక్తపరచెను. ఆంధ్రుడై పుట్టి ఆంగ్లభాషను నేర్చుకుని తల్లిభాష రాక భ్రష్టుడని పించుకున్నాడని జంఘాలశాస్త్రి పాత్ర ద్వారా పానుగంటివారు తన నిరసనను ఆనాడేవ్యక్తపరిచారు. అయినా చాలామంది ఆంధ్రులునీనాటికినీ కళ్ళు తెరవలేదు.

**తెలుగువారు అల్పాహారము అంటారు! ఇదేవిమాటండీ! ఉపాహారం అనండి!**



# విఠ్ఠలుడు వృత్తివర్ణాల విభాగియే గాని అస్పృశ్యతను హర్షించలేదు!

## - జగద్గురుడు' విఠ్ఠ ల కృష్ణుడే!! -



విఠల విఠల పాండురంగా! విఠలపాండు రంగా అక్కడ అందరూ మైమరచి ఆనంద తాండవం చేస్తున్నారు. భారత సమాజంలో 'భక్తి' సమాజంలో అందరూ సములే! వృత్తి కులాల ప్రశ్నే ఉండదు. నిజానికి వెనుకబడిన కులాల నుంచో ఎందరెందరో భక్త మహానుభావులు ఆయన ఆదర ఔదార్యములను పొందారు.

గోదా కుమ్మరి కులం నుండీ వచ్చాడు. నామదేవుడు కుట్టు పని వారి కులం నుంచీ వచ్చాడు. ఓ పనిమనిషి జానాబాయి, సేనా అనే నాయీ బ్రాహ్మణు (మంగళి అనకూడదు)రాలు. నరహరియనే విశ్వబ్రాహ్మణ (కంసాలి) భక్తుడు, నామదేవుని సమకాలికుడే! ఒక బోయవాడు, పంచముడు, కన్నడు, శబరి వీరందరూ భాగవత భక్తులే! వీరి కులం భాగవత కులం. చిత్తశుద్ధి, భగవదంకిత తన్మయత్వం వీరి నిశ్చల, నిర్మల భక్తికి సత్యనిదర్శనాలు.

ఇప్పటికీ ప్రత్యక్ష దృశ్య సత్యంగా చెప్పుకోవాలంటే భోకా – ఇతణ్ణి అస్పృశ్యునిగా భావించేవారు కాబట్టి, ఆలయం వెలుపల నుంచే పండరినాధుణ్ణి దర్శించి వెడుతూండేవాడు. అతడిని ఆలయంలోపలకి ప్రవేశించనిచ్చేవారు కాదు. అతడి నిరంతర విఠల నామ స్మరణంలో ఉండగానే ప్రాకార గోడ కూలి దాని క్రిందపడి చనిపోయాడు. అతని అస్తికుల్ని తీసుకుని వెళ్ళిన ఆస్తికులు ఆలయ ద్వారం అభిముఖంగా ఒక సమాధిని నిర్మించి, ఆ సమాధి నందు భద్రపరిచారు. మరో హరిజనుడు కనకదాసు ఆలయంలోకి వెళ్ళకుండా, ప్రక్కనున్న కిటికీ ద్వారా విఠ్ఠలుణ్ణి దర్శించడం చూచి, ఆ విఠల విగ్రహం కిటికీ వైపునకే తిరిగి దర్శనమిచ్చింది.

ఓ నర్తకి కాంత, ఓ రాజుగారి భార్య మీరాబాయ్ కృష్ణభక్తి (విఠ్ఠలుండాయనే)కే జీవితం అంకితం చేసారు. వీరంతా ఎవరు, వివిధ కులాలవారు. సమాజంలో హెచ్చుతగ్గులున్నప్పటికినీ సకల భువనకర్తలో ఏ పక్షపాతమూ లేకుండా వారికే దర్శనమిచ్చాడు, మోక్షాన్ని ప్రదర్శించాడు. నారదుణ్ణి ప్రతినిధిగా చేసుకుని బోయకులస్థుడైన వాల్మీకిచే తన గాథను రామాయణంగా వ్రాయించుకున్నాడు దేవదేవుడు. శబరి భక్తికి మెచ్చి, ఆమె వద్దకే వెళ్ళి, ఆమె భక్తితో యిచ్చిన పండ్లను భుజించి మోక్షం యిచ్చారు. కన్నప్ప విషయంలోనూ ఇదే మోక్షం శివుడు యిచ్చి కరుణించడం జరిగింది. వీరెవ్వరైనా శాస్త్రాలు చదివారా, స్నానాలు చేసారా, మడులు కట్టారా, జపాలు, పూజలు చేసారా – తనువు నర్పించారు. అన్య చింతనం లేకుండా భగవతీ చింతనమే చేసారు. భక్తికీ, జ్ఞానానికీ, భగవదానుగ్రహానికీ, కీర్తి విస్తరణకూ పూర్ణానుగ్రహప్రసాదుడా విఠ్ఠలుండు – ఆయన అందరికీ ఆరాధ్యమూర్తి. ●

# స్వాతంత్ర దినం వచ్చిందని చంకలు బాదుకోవద్దు!

## - బాధ్యతలను మరిచే పదవులలంకరించవద్దు !! -



జనాన్ని జాగృతం చేసే పై హితోక్తుల్ను చెబుతూ 1961 సం॥ము జనవరి 7న విడుదలైన 'వెలుగు నీడలు' చిత్రంలో ప్రజలూ, నాయకుల ఒంటి దుమ్మును దులిపే 'శ్రీశ్రీ' గీతం 51 సంవత్సరాలుగా జనం వీనుల్లో చిందులాడుతూ, పౌరులూ, నాయకులూ, అధికారులు, వ్యాపారులు అందరి చెంపలనూ చెళ్ళు చెళ్ళుమనిపిస్తున్నా, జనులకు బుద్ధనేది రాలేదు.

పాడవోయి భారతీయుడా – ఆడి
పాడవోయి విజయగీతికా ॥
నేడే స్వాతంత్ర దినం – వీరుల త్యాగఫలం
నేడే నవోదయం నీదే ఆనందం ॥

స్వాతంత్రం వచ్చెననీ సభలే జేసీ
సంబరపడగానే సరిపోదోయ్
సాధించినదానికి సంతృప్తిని పొంది
అదే విజయమనుకుంటే పొరబాటోయ్
ఆగకోయి భారతీయుడా – కదలి
సాగవోయి ప్రగతిదారులా ॥
ఆకాసం అందుకొనే ధరలొకవైపు
అదుపులేని నిరుద్యోగమింకొకవైపు
అవినీతి, బంధుప్రీతి, చీకటి బజారు
అలుముకున్న నీ దేశం ఎట్లు దిగజారు
కాంచవోయి ఈ పరిస్థితీ!

పదవీ వ్యామోహాలు, కులమత భేదాలు
భాషా ద్వేషాలు చెలరేగి నేడు
ప్రతి మనిషీ మరి ఒకరిని దోచుకొనేవాడే
తన సౌఖ్యం తన భాగ్యం చూచుకొనువాడే।
స్వార్ధమే ఈ అనర్ధ కారణం – అది
చంపుకొనుట క్షేమదాయకం ॥
నవసమాజ నిర్మాణమె నీ ధ్యేయం
సకల జనుల సౌభాగ్యమె నీ లక్ష్యం!

పాలక ప్రతిపక్షాల్లో సదా జనుల మంచిని కోరే ఎవడైనా ఉన్నాడా? నువ్వు దొంగా నువ్వు దొంగా అనే నిందించుకుంటున్నవారు అందరూ దొంగలే!



# శ్రీ భగవద్గీతా మకరందం!

శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు



81

## పదకొండవ అధ్యాయము - విశ్వరూప సందర్శన యోగము

**శ్లో॥ మత్కర్మకృతన్మత్పరమో మద్భక్తస్సఙ్గవర్జితః**
**నిర్వైరస్సర్వభూతేషు యస్యః మామేతి పాణ్డవ.**

**వ్యాఖ్య :** భగవంతుని యెవరు పొందగలరో ఇచట చక్కగ వివరింపబడినది. ఐదు సద్గుణములను వచించి, వానినెవడు గలిగియుండునో అతడు తప్పక భగవత్సాయుజ్యమును బడయగలడని శ్రీకృష్ణపరమాత్మ పేర్కొనిరి. 'యః' అని చెప్పుటవలన ఎవడైనను సరియే ఇట్టి మహోన్నతగుణముల నవలంబించి యుండినచో మోక్షభాగుడు కాగలడని స్పష్టము చేయబడినది. ఇట జాతిమతకుల విచక్షణ యేమియును లేదు. యోగ్యతయే ప్రధానము. ఔషధమును ఎవరు త్రాగినను రోగము నయమగును గదా! ప్రమిద, తైలము, వత్తి నిప్పు పెట్టె తెచ్చుకొనినచో దీపము ఎవరికైనను వెలుగునుగదా! గీతయందిట్టి విశాల భావములే పలుచోట్ల వ్యక్తీకరింపబడినవి. గీతయొక్క ఔన్నత్యమున కిట్టి సార్వజనిక భావములే కారణములు.

'మత్కర్మకృత్' – దైవసంబంధములగు పూజ, ధ్యాన, జపాదులను గావించువాడు లేక ఏ కార్యము చేసినను భగవదర్పితముగ జేయువాడు (పాప కార్యములను జేయక సత్కర్మలనే ఈశ్వరార్పణబుద్ధితో నాచరించువాడని అర్థము. అట్టివాడు క్రమముగ చిత్తశుద్ధినిబడసి, భగవత్కృపకు పాత్రుడై, ఆత్మవిజ్ఞానమును బడసి మోక్షము నొందును. జీవితములో మనుజుడు తన దైనందిన కార్యములనెన్నిటినో ఆచరించును. కాని వానినన్నింటిని భగవదర్పితబుద్ధితో చేయుచో, అవి దైవపూజగా పరిణమించిపోవును. అత్తఱి అవి సామాన్య కారణములుగనుండక మోక్షహేతువులుగా మారిపోవును. కనుకనే భగవంతుని పొందగల్గువారిలో 'మత్కర్మకృత్' నాకొఱకే కర్మలుచేయువాడు, లేక నా సంబంధమైన కర్మలు చేయువాడు) అనునది చేర్చబడెను.

'మత్పరమః' – భగవంతునే పరమప్రాప్యముగ, పరమ లక్ష్యముగ దలంచి దైవతత్పరుడైయుండువాడు. సామాన్యముగ జనులలో పెక్కురు ప్రాపంచిక విషయములనే పరమ గమ్యములుగ భావించి వానికొఱకే అహోరాత్రములు కృషి సలుపుచునుందురు. కాని దృశ్య పదార్థములన్నియు అసద్వస్తువులు, నశ్వర్యములు. కావున అవి బంధవిముక్తిని గలిగింపజాలవు. పరమాత్మ యొకడే ఈ ప్రపంచము నందలి సద్వస్తువు, కావున అతనినే తన లక్ష్యముగ, గమ్యముగ జీవుడు తలంచి తల్లక్ష్యప్రాప్తికై యత్నించవలెను. అట్టివాడు భగవంతుని తప్పక పొందగలడు.

'మద్భక్తః' – పరమానందప్రదుడగు భగవంతునియందే అతిశయ భక్తి కలిగియుండవలెనెగాని తదితర పదార్థములందుగాదు. జనన మరణముల నుండి తప్పించజాలని పదార్థముల యెడల భక్తి (ప్రీతి) యున్నచో నేమి ప్రయోజనము? భగవద్భక్తిచే అచిరకాలములో జీవుడు పరమాత్మ పదము నొందగలడను సత్యమిచట వచింపబడినది.

'సఙ్గవర్జితః – సంగమనగా ఆసక్తి, దేహాది దృశ్య పదార్తములందు మమత్వము. అద్దానిని వదలవలెను. అసంగత్వమును అభ్యసించవలెను. అసంగమను పదునైన కత్తితో సంసార (దుఃఖ) వృక్షమును సమూలముగ ఛేదించివేయవలెనని భగవానుడు (గీత 15వ అధ్యాయమున) ఆనతిచ్చియున్నారు. (అసంగశస్త్రేణ దృఢేన ఛిత్వా). తామరాకు నీటిని అంటనట్లు, దృశ్య పదార్థములందు మెలగుచున్నను, విచారణా బలముచే వానితోనంటక, అసంగుడై మెలగువాడు, అట్టి సంగరాహిత్యము వలన ముక్తిని బడయగలడని యిట పేర్కొనబడినది.

'నిర్వైరస్సర్వభూతేషు' – ఇక ఐదవది సమస్త ప్రాణికోట్ల యెడల ప్రేమ, దయ, ద్వేషరాహిత్యము. 'సర్వభూతేషు' అని చెప్పినందువలన ఏ ఒకటి రెండు ప్రాణుల యెడలనో దయగల్గియున్న చాలదనియు, సమస్త భూతకోట్ల యెడల కరుణ, దయగలిగి యండవలెననియు తేలుచున్నది. సమస్త ప్రాణులు భగవత్స్వరూపులు, నారాయణస్వరూపులు. కావున ఏ ప్రాణికైనను, అపకారము చేసినచో, దేవుని కపకారము చేసినట్లే యగును. కాబట్టి నిర్వైరత్వమును లెస్సగ శీలించవలెను. ఈ సత్యమునే 'అద్వేష్టాసర్వభూతానామ్' మొదలగు వాక్యములద్వారా గీతలో పెక్కుచోట్ల భగవానుడు తెలిపియున్నారు. ఒకప్రక్క ఉపనిషద్వాక్యములను వల్లించుచు, దేవుని పూజాదులను సల్పుచు, వేఱొక ప్రక్క, ప్రాణికోట్లను దూషించుచు, ద్వేషించుచు, హింసించుచున్నచో ఆ పూజాదుల వలన నేమి ప్రయోజనము? అది ఆచరణ వేదాంతము కానేరదు. మందు తినువాడు పథ్యము కూడ ఆచరించవలెను. పైన తెలిపిన నాలుగు సుగుణములు (మత్కర్మకృత్ – ఇత్యాదులు) మందు వంటివి. ఈ ఐదవ సుగుణమగు సర్వభూతదయ పథ్యము వంటిది. కాబట్టి వానితోబాటు దీనిని గూడ తప్పక అవలంబించవలెను. ఆ నాలుగు సుగుణములలో ప్రతియొక్కటియు ఈ ఐదవ సుగుణముతో చేరియుండవలెను. ఈ ప్రకారముగ భగవద్భక్తి, సర్వభూతదయ కలవాడు, తప్పక భగవానుని చేరగలడని ('మామేతి') ఈ శ్లోకమందు అందిగ్ధముగ చెప్పివేయబడెను.

గీతయందీశ్లోకము చాలా ముఖ్యమైనది. శ్రీ శంకరాచార్యులవారున్ను గీత మొత్తము మీద ఈ శ్లోకము సర్వోత్కృష్టమైనదని, సారభూతమైనదని తెలిపియున్నారు. ఏలయనిన, దీనియం దన్నియోగములును సంక్షేపముగ బోధింపబడినవి. మఱియు ఆ అన్ని యోగములకు అవశ్యకమైన సర్వభూతదయయు పేర్కొనబడినది. ఎట్లనిన–

(1) నా కర్మలను చేయుము – (మత్కర్మకృత్) – కర్మయోగము

(2) నాయందు తత్పరుడవైయుండుము (మత్పరమః) –ధ్యానయోగము (మందు)

(3) నాయెడల భక్తిగలిగియుండుము (మద్భక్త) – భక్తియోగము

(4) దృశ్య పదార్థముల యెడల సంగము లేకుండయుండును – (సఙ్గవర్జితః) – జ్ఞానయోగము

(5) సమస్త ప్రాణుల యెడల – దయగలిగియుండుము – (నిర్వైరస్సర్వభూతేషు – భూతదయ) – పథ్యము

కాబట్టి సాధకు లీశ్లోకము యొక్క తాత్పర్యమును పదేపదే చింతించుచు, భక్త్యాది సుగుణములు గల్గి పరమాత్మ సాయుజ్యము నీజన్మయందే పొందులాగున యత్నించవలెను.

**ఓమ్**

**ఇది ఉపనిషత్ప్రతిపాదకమును, బ్రహ్మవిద్యయు, యోగశాస్త్రమును, శ్రీకృష్ణార్జున సంవాదమునగు శ్రీ భగవద్గీతయందు విశ్వరూప సందర్శన యోగమను పదునొకండవ అధ్యాయము ఓమ్ తత్ సత్**

– (తరువాయి వచ్చే సంచికలో)

ప్రపంచ దేశాల తెలుగువారి సంస్కృతీ సాంప్రదాయాలకు సేవ చేస్తూన్న ఏకైక పత్రిక
'ప్రముఖాంధ్ర'